సాక్షి తిరుపతి

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024

I



గరుడ వి'హారి'

తిరుమల : పౌర్ణమి గరుడ సేవ వైభవంగా సాగింది. గరుడ వాహనంపై విహరిస్తూ శ్రీవారు భక్తులను అనుగ్రహించారు.



ప్రమాదాల్లో ఇద్దరి మృతి

రేణిగుంట మండలంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. - IIలో



ఉద్యోగాలకు ఎంపిక

సంస్కృత వర్సిటీ విద్యార్థులు 20 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వారిని వీసీ అభినందించారు. - IIలో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 62,880 మంది స్వామివారిని దర్శించుకోగా 21,904 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.03 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ముగిసిన అఖండ గురుపూజోత్సవాలు



పూర్ణానందగిరి స్వామి పాదాలకు పూజలు

ఏర్పేడు: మండల కేంద్రానికి సమీపంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన వ్యాసాశ్రమంలో 87వ అఖండ గురుపూజోత్సవాలు మూడో రోజైన శనివారంతో ముగిశాయి. ఉత్సవాలు వ్యాసాశ్రమ కోశాధికారి అమర్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. శనివారం వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి తమ కుటీరం నుంచి ఊరేగింపుగా మలయాళ స్వామి అధిష్టాన మందిరానికి చేరుకున్నారు. అక్కడ మలయాళ స్వామి చిత్రపటం వద్ద పాదుకలకు విశేష పూజలు చేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పురుష భక్తులు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానందగిరి స్వామి పాదాలకు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం నిర్వహించారు.

లైసెన్స్ తప్పనిసరి

తిరుపతి రూరల్: దుకాణాలు, వ్యాపార సంస్థల నిర్వాహకులు ఈ నెల 29 నాటికి తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలని జిల్లా కార్మికశాఖ ఉప కమిషనర్ బాలునాయక్ తెలిపారు. శనివారం తిరుపతిలోని డీసీఎల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యాపర సంస్థలను నిర్వహించే వారు తమ వ్యాపర సంస్థలకు చెందిన పత్రాలను మీ-సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో సమర్పించి రిజిస్ట్రేషన్, రెన్యూవల్ చేయించుకోవచ్చని తెలిపారు. ఆయన వెంట కార్మికశాఖాధికారి హేమాచారి ఉన్నారు.

1 నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

– తిరుపతి జిల్లాలో 87 పరీక్ష కేంద్రాలు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు తిరుపతి జిల్లాలోని 87 పరీక్షా కేంద్రాల్లో పటిష్టంగా నిర్వహించనున్నట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ) జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ పరీక్షల నిర్వహణపై సీఎస్, డీఓ, కస్టోడియన్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మాట్లాడుతూ మార్చి 1న ప్రథమ సంవత్సరం, 2న ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ పరీక్షకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సర జనరల్‌లో 30,440 మంది, ఒకేషనల్‌లో 1,211 మంది, ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 30,137 మంది, ఒకేషనల్‌లో 1,462 మంది, మొత్తం 63,250 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. రోజు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరా లైవ్ స్ట్రీమింగ్‌తో పాటు జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్లను 'బీఐఈఏపీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్' వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఈ హాల్‌టికెట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ సంతకం అవసరం లేదన్నారు. అలాగే తిరుపతిలోని ఆర్ఐఓ కార్యాలయంలో 0877-2237200 టోల్ ఫ్రీ నంబర్‌ను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీవీఈఓ విశ్వనాథనాయక్, డీఈసీ సభ్యులు రఘుపతి, గోపాల్‌రెడ్డి, తులసి రామిరెడ్డి, సీఎస్, డీఓ, కస్టోడియన్లు పాల్గొన్నారు.



తిరుపతిలో వేదపండితుల ఆధ్యాత్మిక శోభాయాత్ర



తిరుపతి పుట్టిన రోజు వేడుకల సందర్భంగా రామానుజాచార్యుల ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్లు అభినయ్, ముద్రనారాయణ, ఈఓ ఏవీ ధర్మారెడ్డి

ఆవిర్భావం.. ఆధ్యాత్మిక శోభితం



వరాలిచ్చే తల్లిని నేను.. ఆదిపరా శక్తిని నేను

భక్తజన గోవింద నామకీర్తనలు.. భజన మండళ్ల కోలాటాలు.. పండరి భజనలు.. చెక్కభజనలు.. కళాబృందాల లయబద్ధ నృత్యాలు.. సకల దేవతామూర్తులు.. సప్తమహర్షులు.. జగద్గురుల వేషధారణలు.. వేదపండితుల మంత్రోచ్చారణలు.. అబ్బో..! ఎక్కడ చూసినా భక్తిచైతన్యమే తిరుపతి నగరంలో తారసిల్లింది. గోవిందరాజపురంగా ఏర్పడి.. తిరుపతిగా ఖ్యాతికెక్కిన ఆధ్యాత్మిక రాజధాని తిరుపతి నగరం పుట్టిన రోజు వేడుకల్లో భాగంగా శనివారం స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఆధ్యాత్మిక శోభాయాత్ర ఆద్యంతం భక్తి చైతన్యాన్ని నింపింది. యాత్రకు అడుగడుగునా భక్తులు బిందెలతో పసుపు నీళ్లు పులకింపజేసి ముగ్గులేసి భక్తిపూర్వకంగా స్వాగతించారు.

అంబరాన్నంటిన తిరుపతి జన్మదిన సంబరాలు

- గోవిందనామ స్మరణతో పులకించిన తిరునగరి
- కళాప్రదర్శనలతో హోరెత్తిన మాడ వీధులు
- అలరించిన ఆధ్మాతిక శోభాయాత్ర

తిరుపతి కల్చరల్: ఆధ్యాత్మిక తిరుపతి నగరం 894వ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. శనివారం టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వేడుకలకు పురప్రజలంతా ఏకమయ్యారు. తిరుపతి జన్మదిన వేడుకల్లో భాగస్వాములై పండుగ వాతావరణంలో సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి, ఎంపీ డాక్టర్ గురుమూర్తి, డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, నగర మేయర్ డాక్టర్ శిరీష, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం ముందుగా శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



శోభాయాత్రకు పసుపు నీళ్లతో స్వాగతం పలుకుతున్న స్థానిక మహిళలు

మహద్భాగ్యం

తిరుపతి పుట్టిన రోజు వేడుకలకు విచ్చేసిన పుర ప్రజలనుద్దేశించి స్థానిక ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ సద్గురు శ్రీరామానుజాచార్యుల స్వహస్తాలతో 1130 ఫిబ్రవరి 24న శంకుస్థాపనతో గోవిందరాజపురంగా నామకరణం చేసిన ఈ నగరం తిరుపతిగా ఖ్యాతికెక్కిందన్నారు. రెండేళ్ల క్రితం నుంచే తిరుపతి పుట్టిన రోజు పండుగ నిర్వహించే నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టినట్టు వెల్లడించారు. ప్రస్తుతం వరుసగా మూడో ఏడాది కూడా ఆవిర్భావ వేడుకలను వైభవోపేతంగా జరుపుకోవడం మహద్భాగ్యమన్నారు. ప్రపంచంలో ఏ నగరానికీ లేని అత్యంత చారిత్రాత్మకత కలిగి పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న తిరుపతి నగరంలో మనం ఉండడం పూర్వ జన్మపుణ్యఫలమన్నారు. ఈ సంప్రదాయాన్ని భావితరాలకు అందించేలా ప్రతి ఏటా క్రమంతప్పకుండా తిరుపతి పుట్టిన రోజు వేడుకలు కొనసాగాలని ఆకాంక్షించారు.

హోరెత్తిన ఆధ్యాత్మిక శోభాయాత్ర

గోవిందరాజస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక శోభాయాత్రను టీటీడీ చైర్మన్ ప్రారంభించారు. శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్ ఆధ్వర్యంలో సారె సమర్పించి శోభాయాత్రలో పాల్గొన్నారు. డెప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, పుర ప్రజలు, పుర ప్రముఖులు, కార్పొరేటర్లు, వివిధ స్థానిక ఆలయాల చైర్మన్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నవగ్రహ కాంతులు



రామానుజాచార్యుల ప్లకార్డులతో ర్యాలీ



కలశాలతో ఆధ్యాత్మిక ర్యాలీ





పురవీధుల్లో ఊరేగుతున్న పంచమూర్తులు



సంధ్యోముక్తి పురాణ ప్రవచంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



త్రిశూల స్నానఘట్టంలో పులకిస్తున్న భక్తులు, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

వైభవం.. త్రిశూల స్నానం

శ్రీకాళహస్తీశ్వరాలయ సమీపంలోని స్వర్ణముఖి నదిలో శనివారం త్రిశూల స్నానం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి ముందు వచ్చే మాఘపౌర్ణమి రోజున త్రిశూల స్నానం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా రెండు రోజుల ముందు నుంచే నదిలో ఏర్పాట్లు చేపట్టారు. శనివారం ఉదయం స్వామి, అమ్మవార్లు, వినాయకస్వామి, శ్రీవళ్లీ దేవసేన సమేత కుమారస్వామి, చండికేశ్వరస్వామికి ఆలయ అలంకార మండపంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం చప్పరాలపై అధిష్టించి స్వర్ణముఖి నది వద్దకు తీసుకువచ్చారు. నది వద్ద స్వామి, అమ్మవార్లను ఉంచి సద్యోముక్తి పురాణ ప్రవచనం అనంతరం త్రిశూల స్నానం నిర్వహించారు. భక్తులు అదే సమయంలో స్నానమాచరించి పునీతమయ్యారు. తర్వాత స్వామి వారు నంది వాహనం, అమ్మవారు యాళి వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ నాగేశ్వరరావు, ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు, వేదపండితులు, వైసీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. – శ్రీకాళహస్తి

ముక్కంటి ఆలయానికి చిత్రపటాల అందజేత


చిత్రపటాలను అందజేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామి సన్నిధానం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆశీర్వాద మండపానికి తిరుపతికి చెందిన లావణ్య పిక్చర్స్ అండ్‌ఫ్రేమ్స్ ప్రొప్రైటర్ వీ. శంకర్‌నాయుడు రూ.3.75 లక్షలు విలువ గల చిత్రపటాలను అందజేశారు. స్వామి, అమ్మ వార్లు, భక్తకన్నప్ప, మూగజీవాలు శ్రీ(సాలెపురుగు)– కాళ(పాము) – హస్తి(ఏనుగు) చిత్ర పటాలు ఉన్నాయి. వీటిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలి పారు. స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

అన్నప్రసాద సముదాయంలో ఉద్యోగావకాశాలు

తిరుపతి(అలిపిరి): తిరుపతి శ్రీ లక్ష్మీ శ్రీనివాస మ్యాన్ పవర్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో టీటీడీ తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయం, ఇతర అన్నప్రసాద విభాగాలలో అసిస్టెంట్ క్యాటరింగ్ ఆఫీసర్ ఉద్యోగాల నియాకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కార్పొరేషన్ సీఈఓ శేష శైలేంద్ర తెలిపారు. మార్చి 7వ తేదీ మధ్యాహ్నం 4 గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఉద్యోగ, అర్హత, జీత భత్యాల వివరాలకు కార్పొరేషన్ వెబ్ సైట్ http://slsmpc.in/ను సంప్రదించాలని ఆయన సూచించారు.

మహాశివరాత్రి ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సత్యనారాయణమూర్తి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మార్చి 3 నుంచి జరగనున్న మహాశివ రాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను తిరుపతి ఆర్‌జేసీ ఎస్‌బీ సత్యనారాయణమూర్తి పరిశీలించారు. ఈ మేరకు ఆయన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

దారిదోపిడీ –బైక్, సెల్‌ఫోన్, నగదు అపహరణ

సత్యవేడు: పీవీపురం– రాజగోపాలపురం మార్గంలో దొంగలు చెలరేగిపోయారు. నైట్‌డ్యూటీకి వెళ్తున్న ఓ ఉద్యోగిని అటకాయించి దారిదోపిడీకి పాల్పడ్డారు. పోలీసుల కథనం.. వదయ్యపాళెం మండలంలోని అపోలో టైర్ కంపెనీలో నాగలాపురం మండలం, రాజులకండ్రిగకు చెందిన చంద్రశేఖర్ పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి స్వగ్రామం నుంచి పీవీపురం– రాజగోపాలపురం మార్గంలో తన ద్విచక్ర వాహనంపై కంపెనీలో నైట్ డ్యూటీకి బయలుదేరాడు. ఇదే అదునుగా దుండగులు అతన్ని అటకాయించి బైక్, సెల్‌ఫోన్, రూ.1,500 లాక్కున్నారు. ఆపై కిందపడేసి కత్తితో గాయపరిచి బైక్‌లో పరారయ్యారు. ఈ మేరకు బాధితుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వీరాంజనేయులు తెలిపారు.

కోటీశ్వరులకే 'మొదట'

- చిత్తూరు, జీడీనెల్లూరు, సూళ్లూరుపేట తెరపైకి క్యాష్ పార్టీలు
- తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, పూతలపట్టులో బొమ్మాబొరుసాట
- అధినేతలను పక్కనబెట్టి ఎవరికి వారు ప్రచారం
- పార్టీని నమ్ముకున్న వారికి మొదట్లోనే హ్యాండిచ్చిన చంద్రబాబు



సాక్షి, తిరుపతి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మొదట ధనవంతులకే జై కొట్టారు. మొదటి విడత జాబితాలో కేవలం ధనవంతులకే టిక్కెట్లు ప్రకటించి తన మార్క్‌ను చాటుకున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో చిత్తూరు, గంగాధరనెల్లూరు, సూళ్లూరుపేట నుంచి పోటీ చేయనున్న ముగ్గురు అభ్యర్థులు కొత్త వారు ధనవంతులు కాగా.. కుప్పం, పలమనేరు, నగరి, గూడూరు నియోజకవర్గాల అభ్యర్థులు మాత్రం పాత వారే ఉన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల మొదటి జాబితా శనివారం విడుదల చేసిన విషయం తెలిసిందే. చంద్రబాబు సొంత జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు మొదటి జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో గందరగోళంలో పడ్డారు. చంద్రగిరి, తిరుపతి, వెంకటగిరి, సత్యవేడు నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించుకున్న పులివర్తి నాని, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్యేలు ఆనం రామ్ నారాయణరెడ్డి, కోనేటి ఆదిమూలంకు చంద్రబాబు గట్టి షాక్ ఇచ్చారు. జర్నలిజం వృత్తిని విడిచిపెట్టి రాజకీయాల్లోకి అడుగు పెట్టిన మురళీమోహన్ పేరు కనిపించలేదు. పుంగనూరు అభ్యర్థిత్వం కోసం పీకల్లోతు కేసుల్లో ఇరుక్కున్న చల్లా రామచంద్రారెడ్డి పేరు కూడా ప్రకటించలేదు. ఇక జనసేన నుంచి టికెట్ ఆశిస్తున్న తిరుపతి, గంగాధరనెల్లూరు, శ్రీకాళహస్తి నాయకులు మొదటి జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో పవన్ కళ్యాణ్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

డామిట్ కథ అడ్డం తిరిగింది

తను ఏది చేయాలనుకున్నా ముందుగా లీకులివ్వడం అలవాటైన చంద్రబాబు కుప్పం మారే విషయాన్ని తన సతీమణి నారా భువనేశ్వరి నోట పలికించారు. ఆమె పలికిన పలుకులు పెద్ద దుమారాన్ని రేపాయి. అధినేత పరిస్థితే ఇలా ఉంటే.. తమ పరిస్థితి ఏంటని పోటీచేయాలనుకున్న నేతలంతా తీవ్ర అందోళనకు గురయ్యారు. కథ అడ్డం తిరగడంతో కుప్పం నుంచే పోటీ చేస్తున్నట్లు శనివారం తనకు తానే ప్రకటించుకున్నారు.

ఆశావహులకు నిరాశే

చిత్తూరు అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థిగా గురజాల జగన్ మోహన్ పేరును ప్రకటించారు. ఇతను పూర్తిగా పార్టీలో కొత్త అభ్యర్థి. వ్యాపారాలు చేసుకుంటూ.. అప్పుడప్పుడూ చంద్రబాబు వద్దకు వెళ్లి ఫొటోలు తీసుకుని తన సోషల్ మీడియాలో షేర్ చేసుకునేవారు. ఇప్పుడు ఆయన పేరును ప్రకటించటాన్ని స్థానిక టీడీపీ నేతలంతా ఆవేదనలో మునిగిపోయారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వారని, కోటీశ్వరుడని ప్రకటించారా? అని ప్రశ్నిస్తున్నారు. చిత్తూరులో బలిజ సామాజిక వర్గానికి చెందిన కటారి హేమలత కూడా టికెట్ ఆశించి భంగపడ్డారు. చిత్తూరులో టీడీపీ జెండా మోస్తూ హత్యకు గురైన మాజీ మేయర్ కటారి అనురాధ కుటుంబానికి అండగా ఉండాల్సిన సమయంలో విస్మరించడాన్ని పార్టీ శ్రేణులు జీర్ణియించుకోలేక పోతున్నారు. మరో కాపు నాయకుడు కాజూరు బాలాజీ కూడా తనకు టికెట్ వస్తుందని ధీమాగా ఉన్నా, నిరాశే మిగిలింది. పొత్తులో భాగంగా చిత్తూరు జనసేన అభ్యర్థి తానేనంటూ ఆది కేశవులు నాయుడు మనవరాలు చైతన్య ధీమాగా ఉన్నారు. ఈమె ఓ అడుగు ముందుకేసి చిత్తూరులో గ్లాసు గుర్తుకే ఓటు వేయాలంటూ తన ఫొటోలతో ఫ్లెక్సీలు కూడా వేయించుకుని ఇప్పుడు నవ్వుల పాలయ్యారు. మరోవైపు చిత్తూరు నియోజక వర్గంలో వన్నియకుల క్షత్రియుల సామాజిక వర్గానికి చెందిన సీఆర్.రాజన్‌కు కూడా బాబు షాక్ ఇచ్చారు.

గ్లాసు బోర్లా!

పొత్తులో భాగంగా తిరుపతి, శ్రీకాళహస్తి, గంగాధరనెల్లూరు, చిత్తూరు టికెట్ల కోసం జనసేన పార్టీ నాయకులు ఎదురుచూశారు. అందులో గంగాధరనెల్లూరు ఒకటి. మొదటి జాబితాలోనే తమ పార్టీకి టికెట్ లేదని తేల్చేయడంతో జనసేన శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన వాటిలో ఉంటాయో లేదోనని ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే.. రాష్ట్రంలో గత కొంత కాలంగా చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి ఎన్నికల్లోకి వెళ్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో శ్రీకాళహస్తి అభ్యర్థి తానేనని కోలా ఆనంద్ ప్రకటించుకున్నారు. మరో వైపు పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి టికెట్ తనకే కేటాయిస్తారని వినూత పట్టణంలో హల్‌చల్‌చేస్తున్నారు. ఇంకో వైపు బొజ్జల సుధీర్ రెడ్డి తనకు కాదని ఎవరికి టికెట్ ఇచ్చేది? అంత సీన్ లేదంటూ తను, భార్య, తల్లి ముగ్గురూ పచ్చ జెండాలతో హోరెత్తిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు సామాజికవర్గం కోటాలో తనకే సీటు అంటూ తన అనుచరుల వద్ద గట్టిగా చెప్పుకుంటున్నారు. మొదటి జాబితాలో శ్రీకాళహస్తి ప్రస్తావన లేకపోవడంతో ఆశావాహులు తీవ్ర నిరుత్సాహానికి లోనయ్యారు.

27న పాలిసెట్ ప్రవేశ పరీక్ష


వై.ద్వారకనాథరెడ్డి, ప్రిన్సిపల్

తిరుపతి ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు పాలిసెట్ ప్రవేశపరీక్ష మార్చి 27వ తేదీన ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి విద్యార్హతతో ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20 నుంచి 5వ తేదీలోపు "పీఎల్‌వైసీఈటీఏపీ.ఎస్‌బీసీ.ఇన్" వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. తిరుపతి, గూడూరు కేంద్రంగా తిరుపతి జిల్లా విద్యార్థులకు పరీక్ష జరుగుతుందన్ని తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 28 నుంచి ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. పాలిసెట్ పరీక్ష దరఖాస్తుకు సంబంధించి సందేహాల నివృత్తికి 99851 29995 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపల్ కోరారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు

- నేడు గ్రూప్–2 పరీక్షలు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు కల్పించినట్టు కలెక్టర్ జీ.లక్ష్మీశ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఇవ్వమని స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 61 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 27,894 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్ నం. 9000665565, 9676928804లో సంప్రదివచ్చని సూచించారు.

సీఆర్‌టీ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్


హాజరైన విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్పీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో శనివారం ఏపీఎస్‌ఎస్ డీసీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సీఆర్‌టీ పరీక్ష నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ పరీక్షలకు సుమారు 60మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీలత, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మురళి, ఏపీఎస్ఎస్‌డీసీ ఎస్పీవోసీ డాక్టర్ బోసు సతీష్ కుమార్ పాల్గొన్నారు.

శ్రీసిటీలో వైభవంగా త్యాగరాజ ఆరాధనోత్సవం


త్యాగరాజు పంచరత్న కీర్తనలు ఆలపిస్తున్న విద్వాంసులు

శ్రీసిటీ (సత్యవేడు): శ్రీసిటీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం త్యాగరాజ ఆరాధనోత్సవం వేడుకగా నిర్వహించారు. ఉదయం మాఘ పూర్ణిమ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సంగీత కచేరి నిర్వహించారు. శ్రీసిటీ శ్రీవాణి, సూళ్లూరుపేట ఎంజీఆర్ మ్యూజిక్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. ఉత్సాహభరితంగా ఆలపించిన 'త్యాగరాజు పంచరత్న కీర్తనల బృంద గానం' సంగీత ప్రియులను మంత్రముగ్ధలను చేసింది. సంగీత విద్వాంసులు ఝాన్సీ, రాజ్యలక్ష్మి, డాక్టర్ కృష్ణకుమార్, లోకేష్ హరిప్రసాద్, ఇతర బృందాలకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు. ఇకపై ఏటా ఈ ఉత్సవాన్ని వైభవంగా జరపాలని ఆకాంక్షించారు. సంగీత విద్వాంసులందరికీ నిర్వాహకులు జ్ఞాపికలు అందజేశారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

శాంతిపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 26వ తేదీన కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్న రాజుపేట, మఠం తదితర ప్రాంతాల్లో ఏర్పాట్లను డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ షణ్మోహన్ శనివారం వేర్వేరుగా పరిశీలించారు. హెలీప్యాడ్, సభావేదిక స్థలాలను సందర్శించి పలు సూచనలు చేశారు.

27న జాబ్ మేళా

తిరుపతి అర్బన్: బాలాజీకాలనీలోని ఎస్వీసీసీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 27వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళా జరుగుతుందని చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ లింక్ కోసం ఆధార్‌తో ఓటీపీ లింగ్ చేసుకోవాలని కోరారు. అదనపు సమాచారం కోసం 91775 08279, 80749 19939 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. జాబ్ మేళాకు విచ్చేస్తున్న వారికి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించినట్లు ఎస్వీసీసీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగాలకు సంస్కృత వర్సిటీ విద్యార్థులు

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో 2022లో బీఈడీ పూర్తి చేసిన ఒడిశాకు చెందిన 20 మంది విద్యార్థులకు ప్రభుత్వ ఉపాధ్యా య ఉద్యోగాలు లభించాయి. ఇటీవల స్కూల్ ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి ఒడిశా ప్రభుత్వం నోటిఫికేషన్ విడదల చేసింది. ఇందులో ప్రతిభ చూపిన సంస్కృత వర్సిటీ విద్యార్థులు ఏకంగా 20 మంది ఉద్యోగాల కు ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా ఉద్యోగం పొందిన విద్యార్థులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో నాణ్యమైన బోధన చేశారని, అందువల్లే తాము ఉద్యోగాలకు ఎంపికయ్యామని తెలిపారు. వర్సిటీ అధ్యాపకులకు వారు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. వర్సిటీ వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ రమాశ్రీ, అధ్యాపకులు వారిని అభినందించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి


రేణిగుంట-తిరుపతి మార్గంలో మృతి చెందిన గిరి


అల్లికేశం వద్ద మృతి చెందిన సత్తిబాబు

రేణిగుంట: మండలంలో శనివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు... రేణిగుంట–తిరుపతి మార్గం రైల్వే ఆస్పత్రి సమీపంలో సెంట్రింగ్ వస్తువులతో లగేజీ ఆటో తిరుపతి వైపు వెళుతుండగా, వెనుక నుంచి కారు ఢీకొంది. దీంతో ఆటో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో వెళుతున్న సెంట్రింగ్ కూలీ ఏర్పేడు మండలం, మునగలపాళెంకు చెందిన గిరి(45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న అర్జున్, వెంకటమునికి రక్తగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తరలించారు. గిరి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట నుంచి సెంట్రింగ్ సామాన్లు వేసుకుని భవన నిర్మాణ పనుల కోసం తిరుపతి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

అల్లికేశం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని...

రేణిగుంట–పుత్తూరు మార్గం మండలంలోని అల్లికేశం వద్ద ట్రాక్టర్‌లో చెరుకు లోడ్ చేస్తున్న వ్యక్తిని పుత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా, రాజవరం గ్రామానికి చెందిన రాములు కుమారుడు సత్తిబాబు(55) చెరుకు లోడ్డు ట్రాక్టర్‌ను నడుపుకుంటూ పుత్తూరు వైపు వెళుతున్నాడు. అయితే లోడ్డు జారినట్లు అనుమానం వచ్చి ట్రాలీ వెనుక మోకు తాళ్లను బిగదీస్తుండగా, వెనుక నుంచి పుత్తూరు వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్తిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.